# ఘర్షణ

*"మొగడు మస్కట్ పోయిండని ఆగుతలేదు. పూటకొక చీర కట్టి రోజుకొక ఊరు తిరుగుతుంది. బొమ్మలెక్క తయారయి వచ్చిపోయేటోల్లతోని ఇడువకుంట ముచ్చట పెడుతది. చేతుల నాలుగు పైసలు కనపడంగనే కండ్లు నెత్తినెక్కినయి" ఈర్ష్యగా అన్నది లలిత భాగ్యతో.*

ఇంతకుముందు బిత్తిరి దానిలెక్క ఉండె. ఇప్పుడు కండ్లకు అద్దాలు, కాళ్ళకు చెప్పులు వచ్చినయ్. దేశంగాని దేశంల అడ్డమైనోనికి వాడు గులాంగిరి చేసి పైసలు పంపుతుంటే ఇది ఇక్కడ ఆటలాడుతుంది. మాట గూడా మాట్లాడుతలేదు'' సుజాత వైపు చూస్తూ గుసగుసగా అన్నది భాగ్య.

అక్కడికి సుజాత రావడంతో వారి సంభాషణ ఆగిపోయింది. ఒక్కసారిగా అక్కడ ఫారిన్ సెంటువాసన గుప్పుమంది. లలిత భాగ్య ఒకరి మొహం ఒకరు చూసుకుని గుంబనంగా నవ్వుకున్నారు. సుజాత అదిగమనించలేదు. చిన్నగా నవ్వుతూ అడిగింది.

''ఏంటిదక్కా...ఇంకా ఆట మొదలు పెట్టలేదు. ఓ దిక్కు మొగులు ఎక్కివస్తుంది. వానగిట్ల పడుతదేమో! నాలుగు చుట్లు తిరిగి ఆడుతమో లేదో డప్పులోల్లు వచ్చి బతుకమ్మలను లేపుతరు. ఆడుకుందాంరాండ్రి''ఆమె మాటలకు మూతి విరిచింది లలిత. భాగ్య మూతితిప్పుకుంది. సుజాత మనస్సు చివుక్కుమంది.

ఊరి మధ్య మూడువీధుల్ని కలిపే ప్రదేశం అది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆడ, మగపిల్లలు అందరూ అక్కడే ప్రత్యక్షమవుతారు. బతుకమ్మల్ని అక్కడ చేర్చి ఆడుకుంటారు. విరగబూసిన తోట నిండా సీతాకోకచిలుకలు తిరుగుతున్నట్లుగా మారిపోతుంది ఆ ప్రదేశం.

అక్కడ గుమికూడినవారు సుజాత వైపు ఆసక్తిగా ఈర్ష్యగా చూశారు. ఆమె కట్టుకున్న చీర గురించి నగలగురించి ఆరా తీశారు. సెంటుబాగానే చల్లుకున్నావని ఎద్దేవా చేశారు కొందరు. మరదలు వరస ఉన్నవారు సరసాల పేరుతో తమ అక్కసునంతా వెళ్ళబోసు కున్నారు.సుజాత చిన్న బుచ్చుకుంది.

అప్పటికే బతుకమ్మలతో అందరూ అక్కడికి చేరుకున్నారు. ఆట మొదలయింది. అరగంటసేపు కూడా సాగలేదు. ఆట నుండి విడివడి జట్లుజట్లుగా కూడి ముచ్చట్లలో మునిగిపోయారు ఆడవారు. మగవారు వీధి అరుగుల మీద కూర్చుండి చూస్తున్నారు. కొందరి చేతుల్లో సత్తుపిండి ఫలహారాల క్యారియర్లున్నాయి.

''అయ్యో! ఏంటి దుండ్లా...చీరలు కట్టుకున్నంత సేపైనా ఆడకపోతిరి. ఇంకా పొద్దున్నది. ఆడుదాం రండి'' ఒక గుంపును ఉద్దేశిస్తూ ఉత్సాహంగా అన్నది సుజాత. లలిత వసంతలు అదే గుంపులో ఉన్నారు. సుజాత మాటలకు వెక్కిరిస్తున్నట్టుగా అన్నారు.

"నీకేంది....మారాజువు. పొద్దుగూకెదాక ఆడుతవు. తెల్లారేదాక ఆడుతవు. పనా పాటనా! కూసుండి తినుడేనాయె! నాట్లకు, కలుపులకు వంగి వంగి నడుము గుంజుతుంది. ఇంకేం ఆడుమంటవు...ఆట!"

ఆ మాటలకు అందరూ నవ్వారు. సుజాతకు బాధ అనిపించింది. ఏదో అనాలన్న ఆవేశం వచ్చింది. తొందరపడటం బాగుండదని ఆగిపోయింది. వారు ఎందుకలా ఎత్తి పొడుస్తున్నారో ఆమెకు తెలుసు. ఈ మధ్య మరీ రెచ్చిపోతున్నారు. ఏమైనా అంటే విపరీతార్థాలు తీసి పంచాయితీ చేయడానికి సిద్ధమౌతున్నారు. అందుకే మౌనంగా ఉండిపోయింది సుజాత. అప్పుడే డప్పుల చప్పుడయింది. ఎవరి బతుకమ్మను వారు ఎత్తుకుని చెరువు వైపు కదిలారు.

"ఏంపిల్లా....బాగున్నావా? మొగడు మస్కట్ పోయిన్నుండి కనబడుతలేవు. అవ్వగారింట్లనే ఉంటున్నవా?" ఒక వృద్ధురాలు అటకాయించింది సుజాతను.

బతుకమ్మను ఎత్తుకుని ముందుకు నడుస్తూ "లేదత్తా! ఇక్కడనే ఉంటున్న. నీపాణమెట్లుంది" ఆప్యాయంగా పలకరించింది సుజాత.

"గట్లనే ఉంది బిడ్డా! గదేదో షుగర్ బీమారట. నెలరోజులు జెరమొచ్చినన్నా సరేగానీ ఆ బీమారు రాకూడదంట. పెయ్యన్నీ నొప్పులే. మరి పైసలు పంపుతున్నాడా? జీతం బాగానే ఉందట గదా? సుజాత వెంటనడుస్తూ అడిగిందామె.

"పంపుతున్నడు." పొడిపొడిగా చెప్పిముందుకు నడిచింది సుజాత.

వృద్ధురాలు ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి గొణుక్కున్నట్టుగా అన్నది. "మాలచ్చిగాన్ని రెండేండ్లు పోయిరారా అంటే పోకపాయె. పెండ్లాన్ని చూసుకుంట ఇంట్లనే ఉండె. బాకీల మన్నువడ. బాకీగావాలె."

వినిపించి కూడా వినిపించనట్టే మౌనంగా నడుస్తుంది సుజాత. పక్కనే ఉన్న మరో స్త్రీ మాత్రం సుజాతవైపు అసూయగా చూస్తూ అన్నది.

"ఏం పోవుడక్కా...వయసు పెండ్లాలను ఇక్కడ విడిచిపెట్టిపోతే మంచిదాయె చెడ్డదాయె. ఎవలిండ్లల్ల వాళ్ళు చేతనైనకాడికి చేసుకుని ఇక్కడ బతుకుడేనయం. ఏంపైసపాడయింది. పైస సంపాయించాలనే ఎర్రికొద్ది మొగోళ్ళు దేశాలుపట్టుకుని తిరిగితే ఆడోల్లు ఊర్లు తిరుగుతున్నారు. మొన్న మాతమ్ముని అత్తగారింటికాడ గిట్లనే అయింది. లగ్గమైనం కయాడాదికి మస్కట్ పోయిండు. నాలుగేండ్లు అక్కడనే ఉండి లక్షలపైనే పంపిండంట. ఇక్కడ పెండ్లాం ఎవ్వనికోమరిగి వాడు వచ్చేముంగట పైసలు బంగారంతో లేచిపోయిందట."

"అదిగూడ నిజమే మొన్నయాడనో గిట్లనే అయిందట. మస్కట్‌ల బస్సుకింద పడి సచ్చిపోతే ఆరునెల్లకు సచ్చిండని తెలిసిందంట." అన్నది వృద్ధురాలు.

గుంపులో నడుస్తున్నవారు తలోమాట అంటున్నారు. తమకు తెలిసిన విషయాలు చిలువలు పలువలుగా చెప్పుకుంటున్నారు. కొందరు ఆడవారిని తప్పుపడుతున్నారు. మరికొందరు మగవారిని తప్పుపడుతున్నారు. వారిచేతుల్లో పూలబతుకమ్మలు వారి మాటలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి. వాటిని వినలేక నడక వేగాన్ని పెంచి ముందుకు వెళ్ళిపోయింది సుజాత.

అలా వేగంగా వెళ్ళిపోవడం కూడా తప్పయినట్లు ఒకరిద్దరు సుజాతను నిలదీసినట్టుగా అడిగారు. సద్దుల బతుకమ్మ వైనాలు ఏంచేదగ్గరకూడా సూటిపోటి మాటల్ని విన్నది. యారాండ్లు పరుగులు తీస్తూ కేరింతలు కొడుతున్న పిల్లలను తిడుతున్నట్లుగా పరోక్షంగా సుజాతను తిట్టారు. అది గమనించి మరింతగా బాధవేసిందామెకు. దిగులుగా ఇంటికి వచ్చింది.

సుజాత భర్త మస్కట్ వెళ్ళకముందు అందరూ బాగానే మాట్లాడేవారు. అతడు మస్కట్ వెళ్ళాక అక్కడ డ్రైవర్ పని చేస్తున్నాడని, నెలకు పదివేలు జీతమని తెలిశాక ఈర్ష్యగా చూడడం మొదలెట్టారు. ఏదో రకంగా ఆమెను హింసించి సంతోషించటం మొదలెట్టారు. తోటికోడళ్ళు బంధువుల మాటల్లో కూడా విరుపు, ఈర్ష్య కనిపించింది. అతడు క్షేమంగా ఉండి ఉత్తరాలు, చెక్కులు రావడం మొదలయ్యాక మాట్లాడటం మానేసారు.

సుజాత మనసు నిండా ఏవో ఆలోచనలు. ఏదో తెలియని బాధ. ఆ బాధను వ్యక్తపరచలేని బలహీనత. రెండేళ్ళ క్రితం వరకూ శత్రువులంటూ ఎవరూలేరు. పొద్దుంటే మాపులేక మాపుంటే పొద్దులేక తను బాధపడుతుంటే అందరూ జాలిచూపేవారు. తనవద్ద ఎంతో ఓపిక వుందని పొగిడేవారు. కలుపుగోలుతనం ఉందని మెచ్చుకునేవారు. ఇపుడు తను వారికంటే ఆర్థికంగా ఎదిగి పోతున్నాననే ఆలోచన వారిలో అసూయను నింపింది.

ఆ రాత్రి సుజాతకు నిద్రపట్టలేదు. పొద్దన ఉన్న బతుకమ్మ పండుగ ఉత్సాహంఅంతా నీరుకారిపోయింది. ఐదేండ్ల కొడుక్కు అన్నంతినిపించి పడుకోబెట్టింది. తను మాత్రం ఆలోచిస్తూ కూర్చుంది మనుషులు ఎందుకిలా మారిపోతారు? తమకంటే హీనస్థితిలో ఒకరుంటే జాలిపడతారు. ఉన్నతస్థితికి ఎదిగిపోతే అసూయపడతారు. తను ఎవరిని ఏమీ అనదని అందరికీ తెలుసు. అందుకే ఒక్కొక్కరు ఒక్కోరకంగా విరుచుకుపడుతున్నారు. తనమంచితనాన్నే బలహీనతగా గుర్తించి సూటిపోటి మాటలతో వేధిస్తున్నారు.

పొద్దున పక్కింటి కొత్తకోడలు జ్యోతి అన్న మాటలు గుర్తొచ్చాయి. బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పోతను. ఒక మంచి చీర ఇవ్వుమని అడిగింది. సుజాత త్రోసిపుచ్చింది. ఇంతకుముందు ఇద్దరుముగ్గురు అలాగే తీసుకుని వెళ్ళి పాడుచేసి తీసుకవచ్చారు. ఇదేంటీ అంటే అదొక బాధ. అందుకే ఎవరికీ ఇవ్వకూడదనుకుంది. ఆ కోపంతో సుజాత కావాలనే సన్నని బట్టలతో బ్లౌజులు కుట్టించుకుంటుందని అవి బ్రాపట్టీలు కన్పించేవిగా ఉంటాయని మొగాళ్ళందరూ ఆమెనే చూస్తారని పక్కింటి లక్ష్మితో తనకు వినిపించేట్టుగా చెప్పింది జ్యోతి.

అత్తామామలు ఆడకూతుళ్ళుకూడా ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు ఏదో ఒక మాట అంటూనే ఉన్నారు. అల్లరి చేస్తే తనకొడుకును ఏమాత్రం కోపగించుకున్నా అత్తామామలు అడ్డువచ్చి నానా మాటలంటున్నారు. కొడుకును తను ఏమాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేస్తుందని మొహం ముందే సూటిపోటి మాటలంటున్నారు.

ఎలా తెల్లవారిందో తెలియలేదు సుజాతకు. తెల్లవారుజామున ఎప్పుడో కన్నంటుకుంది. లేచేసరికి పొద్దుపొడిచింది. అప్పటికే అందరి వాకిళ్ళలో కల్లాపి ఆరిపోయింది. సుజాత భయం భయంగా వాకిలి ఊడ్వడం మొదలెట్టింది. చుట్టుపక్కల వాళ్ళంతా ఆమె వైపు విచిత్రంగా చూడటం మొదలెట్టారు. తెల్లవారితే దసరాపండుగ. ఇళ్ళన్ని అలుకుచల్లి ముగ్గుల్తో కళకళలాడుతున్నాయి.

"సుఖమత్తే ముఖం కడుక్కోను తీరదట. ఏందిపిల్లా గిప్పడు వాకిలూడుతున్నవు. తిట్టేటోడు తీర్థం బోయె. కొట్టేటోడు కొంపల లేకపాయె. నీకెంది తియ్యి...బుద్ధి ఉన్నప్పుడు నిద్రలేస్తవు." ఆమె భయపడుతుండగానే పక్కింటి ముసలమ్మ అన్నది. మౌనంగా తన పని ముగించుకుని ఇంట్లోకి వెళ్ళింది సుజాత.

సుజాత పండగ ఉత్సాహం చచ్చిపోయింది. వంట చేస్తుండగా భాగ్య వచ్చింది. తన ఇంటికి చుట్టాలువచ్చారని సమయానికి చక్కరలేదని చేబదులు ఇవ్వుమని అడిగింది. ఇస్తే మళ్ళీ బదులు తీర్చదని తెలుసు. ఇవ్వకపోతే ఈ విషయాన్నీ మనుసులో ఉంచుకుని సూటిపోటిమాటల్తో వేధిస్తుందన్న భయంతో అరువు ఇచ్చింది. అదే అదనుగా లలితకూడా అరువు తీసుకుని వెళ్ళింది. చిన్నచిన్న అవసరాలకు తనను వాడుకుని కూడా మాటలతో హింసించడం ఆమెకు ఆవేదనను కలిగించినా కాదనలేదు సుజాత. వారికే కాకుండా చుట్టుపక్కలవారికి కూడా పది, నూరు అప్పుఇస్తూనే ఉంటుంది భయపడి.

ఒకసారి పెంటయ్య వందరూపాయలు అప్పుఅడిగిండు. చేతిలో డబ్బులేక ఇవ్వలేదు. అప్పటినుండి అతడు వెకిలిగా ప్రవర్తించడం మొదలెట్టాడు. చూపులతో సూటిపోటి మాటలతో వేధించనారంభించారు. వెంటనే వేరొకరిదగ్గర అప్పుఅడిగి అతడికి ఇచ్చింది. ఇంతవరకు తిరిగి చెల్లించలేదు. అలాంటి బాకీలు ఇంకా ఉన్నాయి.

ఆలోచిస్తూనే భోజనం మీదకూర్చుంది సుజాత. తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు వెంకట్రాజం. ఆరునెలల క్రితం పొలం కొనుక్కుంటానని పదివేల రూపాయలు బాకీ తీసుకుని వెళ్ళాడు. వాటిని మిత్తితో సహా తీర్చిడానికి వచ్చాడు.

"ఏం కూర వదినా....చికెనా మటనా...."తినే చోటికి వచ్చి అడిగాడు.

సుజాత కూరపేరు చెప్పగానే నవ్వుతూ "అన్నమస్తు సంపాయిస్తుండు. ఏంతింటే ఏం పోతది. నువ్వు ఒక్కపైసకూడా ఖర్చుపెట్టవు." అన్నాడు నవ్వి ఊరుకుంది సుజాత.

"అయినా ఏం పైసలు వదినా....నువ్విక్కడ ఆయన అక్కడ ఆపతిచూస్తడా సంపతి చూస్తడా? ఎన్ని రోజులున్నా చచ్చిపోయేటోల్లమే! బతికినన్నిరోజులు కలిసి బతకాలె. పైసలున్నవాళ్లు చచ్చిపోయేటప్పుడు మూటగట్టుకపోతరా! ఏంది? వయసంతా పాడు జేసుకునుడు. ఇంకెప్పుడు ముసల్లోయినంక సుఖపడతరా!"సుజాతవైపు ఓరగా చూస్తూ అన్నాడు వెకిలిగా.

ఏమనాలో తోచలేదు సుజాతకు. భోజనాన్ని అర్థాంతరంగా ముగించి రోఖా కాగితం తెచ్చి అతడికి అందించింది. మిత్తి అసలు లెక్కబెట్టాడు వెంకట్రాజం. మొత్తానికి మూడు వందలు తక్కువ ఇచ్చి 'ఇంతేఉన్నయి! అన్నాడు. కనీసం బ్రతిమాలి తక్కువ చేయమన్నా సంతోషంగా ఒప్పుకునేది. కానీ అతడు నేనంతే ఇస్తాను అన్నట్టు చిర్రుగా చూస్తున్నాడు. తను ఖచ్చింగా ఇవ్వుమని అడిగితే ఇవ్వకపోగా తనగురించి చెడ్డ ప్రచారం చేస్తాడని భయంతో ఒప్పుకుంది సుజాత. పొలంకొంటున్నానంటే అప్పు ఇచ్చింది. అదీ తక్కువ వడ్డీతో. అంతకుముందు చాలా సార్లు తన భర్త వ్యవసాయానికని వారివద్ద రెండు వేలు అప్పుతెచ్చాడు. వడ్డీ ఎక్కువగానే ఉండేది. ఒక్క రూపాయి కూడా విడిచిపెట్టేవాడు కాదు. ఆ విషయం గుర్తొచ్చింది సుజాతకు. చేసేది లేక మౌనంగాఉండిపోయింది.

ఆరోజు రాత్రి సుధాకర్ వచ్చాడు. ఆ ఊరిలో ఆర్.ఎం.పి. డాక్టర్ అతను. సుజాత తన భర్తకు ఉత్తరం రాయించాలన్నా అక్కడనుండి వచ్చిన ఉత్తరాన్ని చదివించాలన్నా డబ్బు లెక్కలు చేయించాలన్నా అతడివద్దకే వెళ్తుంది.

"నిన్న మా ఇంటికి వచ్చినవటగదా అక్కా! నేను ఊరికి బోయిన. బావకు లెటరు రాయిస్తనంటివి గదా! గౌండ్లోల్ల పెద్దమ్మ బాగలేకపోతే గ్లూకోజు పెట్టి వచ్చిన. మళ్ళీ రేపు ఊరికిపోతున్న. గ్లూకోజు ఎక్కేలోపల లెటరు రాస్త" కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు.

భర్తకు ఉత్తరం రాయించాలనుకుంటూ సుధాకర్ లేకపోవడంతో వాయిదా వేస్తూ వస్తుంది సుజాత. అప్పటికే ఉత్తరం పోస్టు చెయ్యడం ఆలస్యం కావడంతో రాత్రి అని చూడకుండా లెటర్‌ను అందించింది. ఆమె చెబుతుంటే అతడు రాస్తున్నాడు. అప్పుడే కరెంటు పోయింది.

భయంతో అరుస్తున్న కొడుకును సముదాయిస్తూ అగ్గి పెట్టెకొరకు వెదుకుతుంది సుజాత. సుధాకర్ ఏదో అంటుంటే నవ్వింది. అప్పుడే బయట అలికిడి వినిపించింది. వచ్చింది ఎవరా అన్నట్టు చీకట్లోనే తలుపు వైపు చూసింది సుజాత.

"సయ్యాటలాడుడుకు గిప్పుడే తీరికిదొరికిందా డాక్టరూ...గ్లూకోసు అయిపోయింది. ఇంకోటి పెట్టినంక వచ్చి ఆడుకుందువురా. ఎవలను మంచి అనత్తలేదు. ఎవలను చెడు అనత్తలేదు. మనుషులు పూర్తిగా అగాదమైపోయిండ్రు. మొగోల్లను దేశాలు పంపి ఆడోల్లు బుద్దున్న ఆటాడుతుండ్రు. బయటనుంచి ఎల్లవ్వ కంఠం వినిపించింది.

ఆ మాటలు సుజాత హృదయానికి శూలాల్లా తగిలాయి. తుపాకి దెబ్బతిన్న లేడిపిల్లలా వణికిపోయింది. సుధాకర్ మొహం వాడిపోయింది. తప్పంతా తనదే అనుకుని తలవంచుకుని పోయాడు. ఆరాత్రి మంచినీరుకూడా ముట్టలేదు సుజాత. ఏడుస్తూనే పడుకుంది. ఆరు నెలల క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది. ఎల్లవ్వ ఇంట్లోనుంచి నీల్ల బాయి ఉంది. ఒకనాడు సుజాత వెళ్ళేసరికి ఇంట్లో ఎవరూ లేరు. కొడుకు సాంబయ్య ఒక్కడే ఉన్నాడు. నీళ్లు తోడు తుంటే వెనుకనుంచి వచ్చి నడుముమీద చేయివేసి వెకిలిగా నవ్వాడు. కాండ్రించి మొహంమీద ఉమ్మేసివచ్చింది సుజాత. ఎల్లవ్వ బ్రతిమాలి ఎవరికీ చెప్పవద్దని ఒట్టువేసింది. తన కొడుకు తరఫున తాను తప్పయిందని ఒప్పుకుంటున్నానని మళ్ళీ వాడు నీజోలికి రాడని వేడుకుంది. సుజాత సరేనంది. తర్వాత ఎల్లవ్వ ధోరణి మారిపోయింది. తప్పంతా తనదేఅన్నట్టుగా మాట్లాడ్డం మొదలెట్టింది.

వారం రోజులవరకూ మాములు మనిషి కాలేదు సుజాత. తర్వాత భర్తనుండి ఉత్తరం వచ్చింది. ఈసారి సుధాకర్ వద్దకు వెళ్ళాలనిపించలేదు. తనముందే ఆలా అంటున్నారంటే చాటున మరేం మాట్లాడుకుంటున్నారో ఊహిస్తేనే జుగుప్స కలుగుతుంది. ఉత్తరం ఎవరితో చదివించాలన్నది ఆమెకు సమస్యగా మారింది. ఉత్తరంలో ఏ విషయాలున్నాయో తెలియదు. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియదు. బాగా ఆలోచించి మరో వీధిలో ఉన్న అంగన్‌వాడి టీచర్‌తో చదివించాలనుకుంది. కొడుకును ఇంట్లో ఆడుకొమ్మని చెప్పి వెళ్ళింది.

ఎన్నడూరాని సుజాత తన ఇంటికి రావడం చూసి ఆశ్చర్యపోయింది సుశీల. ఆమె చేతిలో ఉన్న ఉత్తరాన్ని చూసి విషయమేమిటో అర్థం చేసుకుంది. సుజాత వద్దని వారించినా వినకుండా టీ చేసి ఇచ్చింది సుశీల. ఆమె టీ తాగుతుంటే తను ఉత్తరాన్ని విప్పింది.

క్షేమసమాచారాల తర్వాత ఎప్పటిలా మనసును తట్టేమాటలు కాకుండా విభిన్నంగా మొదలయిందా ఉత్తరం. దుబారా ఖర్చులు చేయవద్దని అవ్వనాయినలతో కయ్యం పెట్టుకోవద్దని

రాసాడు. సుజాత ఎప్పుడేం చేస్తుందో ఏ ఊరికి వెళుతుందో వెంటవెంటనే తెలిసిపోతుందని పరుషమైన మాటలు రాశాడు. ఇంటిపట్టున్నే ఉండి కొడుకును మంచిగా చదివించాలని రాశాడు.

తను రాసినట్టు నడుచుకుంటే ఫరవాలేదుకానీ ఏమాత్రం తేడా వచ్చినా పొడిచి చంపుతానని వ్రాసాడు.

ఉత్తరం చదవడం పూర్తిచేసి తలెత్తి చూసింది సుశీల. ఆమె మనసు చలించిపోయింది. సుజాత కళ్ళనుండి ధారాపాతంగా నీరు కారుతున్నది. అవమానంతో మొహం కందిపోయింది. ఆ పరిస్థితుల్లో ఆమెను చూస్తుంటే జాలివేసింది సుశీలకు.

'సుజాతా గట్ల బాధపడద్దమ్మా! నీ భర్త చాలా మంచివాడు. ఇది ఆయనకు పుట్టిన బుద్ధికాదు. ఇక్కడి నుండి ఎవరో కల్పించి ఉత్తరంరాసి ఉంటరు. అందుకే ఆయన ఈ విధంగా రాసిండు. నువ్వేం బాధపడకు. ఇన్ని రోజులు ఊర్లె ఉన్నదో లేదో అన్నట్టు మెదిలినవు'' ఓదారుస్తూ అన్నది సుశీల.

''కాదక్కా ఇన్నిరోజులు ఎవలేమన్నా పట్టిచ్చుకోలేదు. నా భర్త ఒక్కడు నన్ను క్షేమంగా చూసుకుంటే చాలనుకున్న. ఇప్పుడు గాయిన గూడ గిట్టరాసె. నేనేం తప్పు జేసిన్నక్క. తామరాకు మీద నీటి బొట్టు లెక్కమెదులుతున్న ఎవ్వల్ని ఏమంటే ఏం తిడతరోనని మౌనంగా ఊకున్న.

ఈ మస్కట్‌ల మన్నువడ. మస్కటంట పోయి నన్ను మంది నోర్లల్ల వేసిపోయిండు. ఏం తిన్ననో యాడ ఉన్ననో ఎవ్వలకు తెల్వకుంట ఉన్న. ఇప్పుడు ఊరందరి కండ్లు మండవట్టె. అత్త నేమనలేదు. మామనేమనలేదు. యారాండ్లను ఏమనలేదు. వట్టివట్టిగనే ఓర్వలేకమాట బందుజేసింద్రు'' వెక్కుతూ చెప్పింది సుజాత.

''ఈ మధ్య తరగతి మనుషులు గింతే సుజాత. తమ కండ్ల ముందు తమలో ఒకరు పైకి వస్తే ఓర్వరు. నా సంగతేచూడు. అంగన్‌వాడి ఉద్యోగం రాక ముందు వాడకట్టు మొత్తం మంచిగ మాట్లాడుదురు. ఇప్పుడు ఇండ్ల నేనేదో వేలు సంపాయిస్తున్నట్టు ఈర్ష్య పడుతుంద్రు. ఒకామె నూనె బదలు ఇవ్వుమని వస్తది. మరొకామె జిలకర అని వస్తది. ఇస్తే మంచి మాట. ఇయ్యకపోతే వట్టిగనే రావట్టె ఇస్తేం బోతది అని మొహం ముందే కయ్యం జేత్తరు. మావాడకట్టోల్లు ఎవ్వలు సరిగ్గ మాట్లాడరు ఇప్పుడు'' ఆవేదనగా అన్నది సుశీల.

''ఈయనను మస్కట్ పొమ్మన్నది నేను కాదు. డబ్బు సంపాదించమన్నది నేను కాదు. నేను ఏతప్పు చేయలేదు. అయినా క్షణక్షణం యాతనకు గురవుతున్న. లోకం గిట్లవాడుకుంటరని మొదటి నుండి ఎంతో జాగ్రత్తగా మెదులుకుంటవస్తున్నా. అయినా సూటిపోటి మాటలతో బాధ పెడుతుంద్రు. మనసుకు తుర్తి లేకుండ జేస్తుంద్రు'' కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పింది సుజాత.

''నువ్వు గిదేం మనసుల పెట్టుకోకు. గీ జనమే గింత. తెల్లగున్నా బాధనే. నల్లగున్నా బాధనే. ఓర్వలేని జనం పక్కవాడు బాగుపడితే జీర్ణించుకోలేరు. మనం వారికంటే ఎంత అధమస్థానంకు దిగిపోతే అంతజాలి చూపిస్తరు. ఎంత ఎదిగిపోతమో అంత ఈర్ష్య చూపిస్తరు. ఇది లోకం. దాన్ని మనం మార్చలేము. బాధపడేకంటే ఎదురీదడం నేర్చుకోవాలి. ఏడ్చేకంటే తట్టుకుని నిలబడడం నేర్చుకోవాలి. మనం ఎంతగా బాధపడి ముడుచుకుపోతే అన్ని మాటలంటరు. నిలబడి ఎదురు మాట అంటే పారిపోతరు. నువ్వుగిట్ట మనాది పెట్టుకుంటే మనిషివే కావు. లేని లేని రోగాలు సుదురాయించుతయి'' ఓదార్చుతూ చెప్పింది సుశీల.

కొద్దిసేపు తన బాధనంతా చెప్పుకుని బయటపడింది సుజాత. కారటు ఎవరి కంటపడకుండా బోడ్లో దోపుకుంది. భుజం చుట్టూ కొంగు కప్పుకుని వంచిన తల ఎత్తకుండా ఇల్లు చేరింది. ఇంట్లో జనం గుమిగూడి ఉండడంతో గుండె దడదడలాడింది. మందిని చీల్చుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది. తన కొడుకు ఏడుస్తున్నాడు.

"పొల్లగాడు అరుగుమీదికెల్లి అడ్డంబడ్డడు ఒక్కన్ని ఇంట్ల ఉంచి ఎటుతిరగబోయినవు" ఎవరో అంటున్నారు.

"సంటిపొల్లగాన్ని ఇడిసి పెట్టి పోతావే. పోరగాండ్లు పోరగాండ్లు కొట్లాడుకునిరి. ఎవడో పోరడు నూకితే అరుగుమీదికెల్లి కిందపడె. ఎంబడ వెట్టుక పోవా?" మరెవరో అంటున్నారు.

కొడుకును దగ్గరికి తీసుకుని తలనిమిరింది సుజాత. తలకు చిన్నగాయమైతే ఎవరో పసుపు అద్దికట్టుకట్టినట్టున్నారు. వెంట్రుకల్లో చిక్కుకున్న రక్తాన్ని శుభ్రంగా కడిగింది. ఒక్కొక్కరు ఒక్కొక్కమాట అంటూ నిష్క్రమిస్తున్నారు. చివర అత్త వచ్చింది మనుమడిని దగ్గరకు తీసుకుని గాయి కెత్తుకుంది.

"నా కొడుకును దేశాలు పట్టిచ్చినవు. అడు తిప్పలు పడుకుంట పైసలు పంపితే గుర్రమోలె కూసుండి తింటున్నవు. తిరుగుడుకు సందయితలేదని వీన్ని సంపుతవా ఏందీ..." గొంతు చించుకుని అరిచింది అత్త.

కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే మౌనంగా ఉండిపోయింది సుజాత. కాసేపు అలాగే అరచి వెళ్ళిపోయింది.

సుధాకర్ వద్దకు ఎవరినో తోలి రప్పించింది. ముభావంగానే ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళాడు. అతడి మనసు కూడా గాయపడిందని అర్థం చేసుకుంది సుజాత. పదిహేను రోజుల తర్వాత భర్త ఇరవై వేల చెక్కు పంపించాడు. ఉత్తరాన్ని సుశీల చేత చదివించుకుంది. చెక్ బ్యాంక్‌లో వేస్తే పదిరోజుల తర్వాత డ్రా చేసుకోవచ్చు. ఎప్పుడైనా చెక్‌ను సుధాకర్ చేత మండల కేంద్రంలో ఉన్న బ్యాంకుకు పంపించేది. వద్దన్నా వినకుండా బస్సు కిరాయిలకని ఇరవై రూపాయలు కూడా ఇచ్చేది. డ్రా చేసేటప్పుడు మాత్రం తనే వెళ్ళేది. వీలుంటే సుధాకర్ కూడా వచ్చేవాడు.

ఈసారి తనేవెళ్ళి బ్యాంక్‌లో వేసివచ్చింది సుజాత. చెక్ వేస్తుండగా చూసిన ఇద్దరు ముగ్గురు ఇంటికి వచ్చి అప్పు అడిగారు. తనకే అవసరం ఉన్నాయని చెప్పింది సుజాత. తన ఊరిదగ్గరే ఉన్న మరోఊరి వ్యక్తితో సామాన్లు పంపించాడు సుజాత భర్త. అతడు జీపులో వచ్చి సామాన్లు ఇచ్చి వెళ్ళాడు. ఇంటి ముందు జీపు ఆగడం అందులో నుండి సామాన్లు దింపడం చూసి చుట్టుపక్కల వాళ్ళకు మరింత ఈర్ష్యను కలిగించింది. ఆ సామాన్లను తమకు చూపించలేదన్న కోపం బంధువులలో పెరిగిపోయింది.

మరోనాడు అదే వ్యక్తి స్కూటర్ పై వచ్చాడు. మస్కట్ నుండి ఫోన్ వచ్చిందని సుజాతను తీసుకుపోయాడు. సుజాత ఎన్నడూ స్కూటర్ ఎక్కలేదు. నడిఊర్లో జనం మధ్యనుండి స్కూటర్ వెళ్తుంటే ఎవరేమనుకుంటున్నారోనని బిగుసుకుపోయి కొడుకును హత్తుకుని కూర్చుంది సుజాత. భర్తనుండి ఫోన్‌రాత్రి తొమ్మిది తర్వాత రావడంతో అక్కడే ఉండిపోయింది. మరునాడు ఎంతవారించినా వినకుండా స్కూటర్ మీదనే దింపి పోయాడతడు. గట్టిగా వారిస్తే తన భర్తతో ఏం చెబుతాడోనన్న భయం. అందుకే గట్టిగా వద్దని చెప్పలేకపోయింది.

ఇంటికి రాగానే ఓపిగ్గా సమాధానం చెప్పలేక నానా తంటాలు పడింది సుజాత. వసంత, లలిత లైతే ఏం వస్తువులు పంపాడు. అతడెవరు రాత్రి ఎక్కడున్నావంటూ గుచ్చి గుచ్చి అడగడం

మొదలెట్టారు. మధ్యలో ఒకటి రెండుసార్లు తన భార్యతో కలసి వచ్చాడతడు. మస్కట్ వెళ్ళేముందు కూడా చెప్పి వెళ్ళాడు. భర్తకు ఫలహారాలు చేసి పంపింది సుజాత.

ఒకనాటి రాత్రి కడుపులో ఏదో నొప్పి మొదలయింది సుజాతకు. లేచి టైం చూసింది. పన్నెండు దాటింది. తలంతా మొద్దుబారిపోయింది. క్షణక్షణం నొప్పి అధికమవుతుంటే భయం పట్టుకుంది. ఒళ్ళంతా చెమటలు కమ్మాయి. అంతరాత్రి ఎక్కడకు వెళ్ళాలో తోచలేదు. అత్తను లేపి విషయం చెబుతాననుకుని తలుపు తెరిచింది. ఎదురు వీధిలోనే అత్తమామలు ఉండే ఇల్లు. రెండడుగులు వేసిందో లేదో సైకిల్ పై వెళుతూ కనిపించాడు సుధాకర్. మొక్కబోయిన దేవుడు ఎదురుగా కనబడ్డట్టు అనిపించింది సుజాతకు.

సుధాకర్‌ను పిలిచి విషయం చెప్పింది. అంతవరకు ఒక డెలివరీ కేసు అటెండ్ చేసి వస్తున్న సుధాకర్ ఏమీ భయపడవద్దని చెప్పి రెండు రకాలమాత్రలు ఇచ్చాడు. ఒక ఇంజక్షన్ కూడా ఇచ్చాడు. సరిగ్గా అప్పుడే ఇంటితలుపులు మూసుకున్నాయి. బయటనుండి ఎవరో తలుపు దగ్గరకు లాగి గొళ్ళెం వేసి అందరిని పిలుస్తున్నాడు. అతడి గొంతును బట్టి అతడు సాంబయ్య అని గుర్తుపట్టి కలవరపడింది సుజాత.

ఏం జరుగబోతుందో ఆమె ఊహించింది. అప్పటికే ఆలస్యమైంది. వాకిట్లో జనం గుమిగూడారు. వారందరికీ ఏదేదో చెబుతున్నాడు సాంబయ్య. అందరూ కూడబలుక్కుని తలుపుతీశారు. ఇంట్లో సుధాకర్ ఉండడంతో సాంబయ్య మాటల్ని అందరూ నమ్మేశారు. సుజాత గొంతు పెకల్లేదు. ఏడుస్తూ ఉండిపోయింది. సుజాత అత్తా మామ తోడికోడళ్ళు, బావలు సుజాతను దూషించారు. అందరూ సమావేశమై ఆమె భర్తను మస్కట్ నుండి రప్పించి అసలు విషయం చెప్పి విడాకులు ఇప్పించాలనుకున్నారు. చెడిపోయిన ఆడదని నిందవేశారు.

అనుకున్నదే తడవుగా భార్య చనిపోయిందని వెంటనే రావాల్సిందిగా ఒకటి వెంట ఒకటి మూడు టెలిగ్రాంలు ఇచ్చారు. వారం తిరగక ముందే ఇల్లు చేరుకున్నాడు. జరిగిందంతా చిలువలు పలువలుగా వర్ణించి చెప్పారు. కూరుకు రాత్రి వరకూ బోధ చేసి ఎక్కడివారు అక్కడికి వెళ్ళిపోయారు.

వారం రోజుల్లోనే ఎన్నో ఏండ్లుగా జ్వరం వస్తున్న పేషంట్‌లా మారిపోయింది సుజాత. ఏడ్చి ఏడ్చి కన్నీళ్ళుకూడా ఇంకిపోయాయి. జరిగిందేమిటో తన వంతు బాధ్యతగా భర్తకు చెప్పుకుంది. తన తప్పేమీ లేదని అతడికాళ్ళపై పడి ఏడ్చింది. ఆమె తలను నిమురుతూ కౌగిలిలోకి తీసుకుని ప్రేమగా చెప్పాడు వెంకట్.

"పిచ్చిదానా నువ్వు ఎలాంటి దానివో నాకు తెలుసు. వాళ్ళకు ఎలా బుద్ధిచెప్పాలో కూడా తెలుసు. నీకు అన్యాయం చేస్తానని ఎలా అనుకున్నావు. నిన్ను గింతనే అర్థం చేసుకున్నానా? నువ్వు కడిగిన ముత్యానివని నాకు తెలుసునే. ఇక్కడి సంగతులన్నీ నా దోస్త్ చెప్పిండు. నీ తప్పు ఏమీలేదు.

సుజాత తన చెవులను తానే నమ్మలేకపోయింది. అతడు మాట్లాడింది నిజమేనని తెలిశాక కన్నీటితో అతడి పాదాలను అభిషేకించింది.

*(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం 21-5-2000)*

*(ఆధునిక కథాసరిత్సాగరం - కరీంనగర్ జిల్లా కథలు రెండవ సంపుటి)*